## మైనింగ్ గనులపై అధికారుల దాడులు..2 యంత్రాలు స్వాధీనం


గనులపై దాడులు నిర్వహించిన అధికారులు

**న్యాల్‌కల్, అక్టోబరు 24, ప్రభాతవార్త:** ఎర్రరాయి తవ్వకాలు నిర్వహిస్తున్న గనులపై అధికారులు దాడులు నిర్వహించారు. మండల పరిధిలోని గణేష్‌పూర్ గ్రామ శివారులో అక్రమంగా 20 గనులలో ఎర్ర రాయి తవ్వకాలు నిర్వహిస్తున్నట్లు తెలుసుకున్న మైనింగ్ అధికారు రెవిన్యూ అధికారులతో కలిసి గురువారం దాడులు నిర్వహించారు. గనుల వద్ద ఎర్ర రాయి తవ్వకాల కొరకు సిద్ధంగా ఉంచిన 2 యంత్రాలను అధికారులు స్వాధీనం చేసుకుని మండల పరిధిలోఇ హద్నూర్ పోలీసు ఠాణాకు తరలించారు. కార్యక్రమంలో మైనింగ్, రెవిన్యూ శాఖల అధికారులు శ్యామ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట

వార్త



## పోలీసు అధికారులు, సిబ్బందికి వ్యాసరచన పోటీలు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా సీపీ డాక్టర్ అనురాధ ఆదేశాల మేరకు గురువారం ఏఆర్ అడిషనల్ డీసీసీ సుభాష్‌చంద్రబోస్ ఆధ్వర్యంలో సిద్దిపేట, గజ్వేల్, హుస్నాబాద్ డివిజన్ పోలీసు అధికారులకు, సిబ్బందికి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కానిస్టేబుల్ నుంచి ఏఎస్ఐలకు సమాజంలో పోలీసు ప్రతిష్టను మెరుగుపరచడంలో పోలీసుల పాత్రనే అంశంపై పోటీలు నిర్వహించారు. అలాగే ఎస్ఐ స్థాయి నుంచి పై అధికారులకు దృఢమైన శరీంలో దృఢమైన మనస్సు అనే అంశంపై పోటీలు నిర్వహించార. కానిస్టేబుల్ నుంచి ఏఎస్ఐ వరకు నిర్వహించిన పోటీల్లో ముగ్గురని,ఎస్ఐ స్థాయి నుంచి పై స్థాయి అధికార వరకు ముగ్గురు చొప్పున ఆరుగురిని ఎంపిక చేసి రాష్ట్ర స్థాయికి పంపించడం జరుగుతుందని ఏఆర్ అడిషనల్ డీసీసీ సుభాష్‌చంద్రబోస్ తెలిపారు. రాష్ట్ర స్థాయిలో ఎంపికైన పోలీసు అధికారులకు, సిబ్బంది అప్రిసియేషన్ సర్టిఫికెట్, నగదు రివార్డు అందజేయడం జరుగుతుందన్నారు.


దౌల్తాబాద్ పాఠశాలను తనిఖీ చేస్తున్న కలెక్టర్ క్రాంతి వల్లూరి

## దౌల్తాబాద్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ తనిఖీ

**హత్నూర అక్టోబరు 24,ప్రభాతవార్త:** హత్నూర మండలం దౌల్తాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను గురువారం సంగారెడ్డి జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరి ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాల రికార్డులను పరిశీలించారు. ఈ ఏడాది పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రత్యేక తరగతులు నిర్వాహించాలని అదేశించారు. పాఠశాలలోని సమస్యలను విద్యార్థులు, ఉపాధ్యాయులు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని కలెక్టర్ క్రాంతి వల్లూరి వారికి హమీ ఇచ్చారు.

### వసతి గృహాల్లో పిల్లలకు మెనూ ప్రకారం
## నాణ్యమైన భోజనం అందించాలి
### సిద్దిపేట జిల్లా కలెక్టర్ మను చౌదరి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** జిల్లా కేంద్రంలోని నూతన యూనియన్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ కేంద్రాన్ని సిద్దిపేట జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి గురువారం పరిశీలించారు. శిక్షణ కేంద్రంలో ఎంత మంది శిక్షణ ఇచ్చారు.. ఎంత మంది ఉపాధి పొందుతున్నారని అడిగి తెలుసుకున్నారు. అసక్తి ఉన్న ప్రతి ఒక్కరూ అన్ని సౌకర్యాలతో కూడిన శిక్షణను తీసుకొని ఆయా రంగాలలో ఉపాధి పొందాలని కలెక్టర్ సూచించారు. అనంతరం సిద్దిపేట అర్బన్ మండల పరిధిలోని మిట్టపల్లి గ్రామంలోని తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, జూనియర్ కళాశాలను కలెక్టర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. పాఠశాలలో సౌకర్యాలుపై ఆరా తీశారు. భోజనం నాణ్యత, మెనూనప్రకారం పెడుతున్నారని అడిగి తెలుసు కు న్నారు. అలాగే జిల్లా కేంద్రంలోని షెడ్యూల్ కులాల అభివృద్ధిశాఖ కళాశాల బాలుర వసతి గృహాన్ని జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వంట సామాగ్రితో పాటు భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నాణ్యతతో కూడిన వంట సామాగ్రిని వినియోగించాలని హాస్టల్ వార్డెన్ శ్రీనివాస్‌కు సూచించారు. కలెక్టర్ వెంట అర్బన్ డిప్యూటి తహాశీల్దార్ ఉదయశ్రీ ఉన్నారు.

## విగ్రహ ప్రతిష్టకు ఎంపికి ఆహ్వానం


ఎంపి రఘునందన్‌రావుకు ఆహ్వానపత్రికను అందిస్తున్న దృశ్యం

**చిన్నశంకరంపేట, అక్టోబరు 24, ప్రభాతవార్త:** మండల పరిధిలోని కామారం గ్రామంలో 28వ తేదీన నిర్వహించే పోచమ్మ దేవతల విగ్రహ ప్రతిష్ట, బోనాల పండుగకు హాజరుకావాలని మెదక్ ఎంపీ రఘునందన్ రావుకు, బిజెపి జనరల్ సెక్రటరీ దశరథం, రమేష్ గురువారం భాగ్య నగరంలోని ఆయన నివాసంలో వారికి ఆహ్వాన పత్రికను అందించారు. అలాగే బిజెపి జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్‌కు ఆహ్వాన పత్రికను అందించారు. మండల బిజెపి అధ్యక్షుడు పోగుల రాజులు ఉన్నారు.

### అరుణాచలం బస్సును ప్రయాణికులు
## వినియోగించుకోవాలి : డిఎం వెంకటేశ్వర్లు

**హుస్నాబాద్ టౌన్, అక్టోబరు 24, ప్రభాతవార్త :** కార్తీక పౌర్ణమి సందర్బంగా హుస్నాబాద్ డిపో నుండి అరుణాచలంకు గిరిప్రదక్షినకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు మేనేజరు వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్బంగా నడిపే బస్సులు నవంబర్ 13వ తేదీ నుండి 16వ తేదీవరకు నడుస్తాయని 16వ తేదీన యాత్ర పూర్తవుతుం దన్నారు.ఈ ప్రాంతం నుండి అరుణాచలం వెల్లే భక్తులు ఈ ప్రత్యేక బస్సులను సద్వినియోగం చేసుకోవాలన్నారు.పూర్తి వివరాల కోసం హుస్నాబాద్ బస్టాండ్‌లోని కంట్రోల్‌రూం లేదా, 9154298673, 7075146238, 8464084478, 9959225930 నంబర్లకు సంప్రదించాలన్నారు.

## పోలీస్ స్టేషన్‌ను తనిఖి చేసిన ఎస్‌పి రూపేష్

**పటాన్‌చెరు, అక్టోబర్ 24, ప్రభాతవార్త:** జిన్నారం మండలంలోని ఐడిఎ బొల్లారం పోలీస్ స్టేషన్‌ను రాష్ట్ర పోలీసు అధికారుల సూచన మేరకు సంగారెడ్డి జిల్లా ఎస్పీ చెన్నూరు రూపేష్ గురువారం సందర్శించారు. ముందుగా పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. పోలీసు సిబ్బంది పనితీరును పర్యవేక్షించి సంతృప్తి వ్యక్తం చేశారు. సైబర్ నేరాల సంఖ్య గణనీయంగా పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్‌నేరాల సంఖ్య తగ్గించేందుకు కఠినమైన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఎస్పీతోపాటు అదనపు ఎస్పీ సంజీవ్‌రావు, పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి, బొల్లారం ఇన్‌స్పెక్టర్ గంగాధర్‌లు, తదితరులున్నారు.


జిన్నారం పోలీస్ స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ రూపేష్

# పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించడమే లక్ష్యం

### వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ

**హత్నూర అక్టోబరు 24, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని మారుమూల ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా, ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. గురువారం హత్నూర మండలం దౌల్తాబాద్‌లో కోటి 56 లక్షలతో నిర్మించిన నూతన ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనాన్ని, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండ సురేఖ, స్థానిక ఎమ్మెల్యే సునితాలక్ష్మారెడ్డి, టిజిఐసిసి చైర్మన్ నిర్మాల జాగ్గారెడ్డి, జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్బంగా మంత్రి మాట్లాడుతూ జనాభాకు, అనుగుణంగా ప్రభుత్వ అసుపత్రులను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. దౌల్తాబాద్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 30 పడకల ఆసుపత్రిగా మారుస్తామని, అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి సంబంధిత అధికారులకు అదేశించారు. పేద ప్రజలకు ఉచిత వైద్యం అందించడంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు. ఈ సందర్భంగా మంత్రులు దామోదర్‌రాజనర్సింహ, కొండా సురేఖలు దౌల్తాబాద్ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహనికి పూలమాలలు వేశారు. ఈ సందర్బంగా అశావర్కలు, ఎఎన్ఎంలు తమ సమస్యలు పరిష్కరించాలని మంత్రి దామోదర్ రాజనర్సింహకు వినతిపత్రాలు అందజేశారు. ప్రారంబోత్సవ కార్యాక్రమంలో మెదక్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసినిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షుడు అంజనేయులుగౌడ్, మహిళా అధ్యక్షురాలు దానంపల్లి సుజాత, నర్సాపూర్ ఇన్‌చార్జి అవుల రాజిరెడ్డి, మెదక్ ఆర్డీఓ రాజు, జిల్లా వైద్యాధికారి గాయత్రి, పిఆర్ ఇఇ జగదిశ్వర్, మండల ప్రత్యేక అధికారి, జడ్పీ డిప్యూటి సిఇఓ స్వప్న, తహసీల్దార్ శేఖ్‌ఫర్వీన్, ఎంపిడిఓ శంకర్, మైనార్టీ సెల్ మండల కార్యదర్శి ఎం.ఎ.హాకీమ్, మండల అధ్యక్షుడు కె.కృష్ణ, నాయకులు దేవేందర్‌రెడ్డి, నర్సింలు, దానంపల్లి సత్యం తదితరులు పాల్గొన్నారు.


పిహెచ్‌సి భవనంను ప్రారంభిస్తున్న మంత్రులు దామోదర్ రాజనర్సింహ,కొండ సురేఖ

## ప్రమాదాలను ముందుగానే గుర్తించి నియంత్రించాలి

**పటాన్‌చెరు, అక్టోబరు 24,ప్రభాతవార్త:** భవిష్యత్తులో జరగబోయే ప్రమాదాలను గుర్తించి, వాటిని నియంత్రించేలా డిజైన్లను రూపొందించాలని భావి ఇంజనీర్లకు ఆస్ట్రేలియాలోని మోట్ మెక్- డొనాల్డ్ టన్నెల్స్ రవాణా టెక్నికల్ డైరెక్టర్ రోషన్‌నాయర్ సూచించారు. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని సివిల్, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాల ఆధ్వర్యంలో సొరంగం-భద్రత, రూపకల్పన సుస్థిరత, స్థిరత్వం, డిజిటలైజేషన్, కృత్రిమ మేథ అనే అంశంపై గురువారం ఆతిథ్య ఉపన్యాసం చేశారు. ఇన్-స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ గీతం విద్యార్థి విభాగం సౌజన్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా వివిధ ప్రాజెక్టులకు డిజైన్లను రూపొందించే సమయంలో ఎదురైన సవాళ్లను, వాటిని అధిగమించేందుకు అమలు చేసిన వినూత్న పరిష్కారాలను వివరించారు. ఇంజనీరింగ్‌లో సుస్థిరత ప్రాముఖ్యతను నొక్కిచెబుతూ, పునర్వినియోగపరచ్చదగిన బహుళ ప్రయోజనాల కోసం అనుకూలించే డిజైన్ల ఆవశ్యకతను నొక్కి చెప్పారు. కృత్రిమ మేథ ఉన్నప్పటికి ఇప్పటికి మాన పర్యవేక్షణ అవసరమని, పరిష్కారాలను అందించడంలో ఇంజనీర్లు కీలకపాత్ర పోషిస్తారని డాక్టర్ నాయక్ తెలిపారు. విధ్యార్థులు గొప్ప కలలను కనాలని, ఉన్నత లక్ష్యాలను ఏర్పరుచుకోవాలని, అంకితభావంతో పనిచేస్తే ఇంజనీరింగ్ రంగంలో ఆశయాలను సాధించగలరని వారికి భరోసా ఇచ్చారు. తొలుత, గీతంలోని పలు ప్రయోగశాలలు, జీ-ఎలక్ట్రా, ఏరోమోడలింగ్, సాంకేతిక అన్వేషణ, ఉత్పత్తి ఇంజనీరింగ్(టీఈపీ) ల్యాబ్‌లను డాక్టర్ నాయర్ సందర్శించారు. స్కూల్ ఆఫ్ టెక్నాలజీ అసోసియేట్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎన్ సీతారామయ్య డాక్టర్ నాయర్‌ను సత్కరించగా, సివిల్ ఇంజనీరింగ్ విభాగధిపతి వందన సమర్పణ చేశారు. మెకానికల్ ఇంజనీరింగ్ విభాగధిపతి డాక్టర్ పి.శ్రీనివాస్ కార్యక్రమాన్ని సమన్వయం చేశారు.

## వాల్మీకి విగ్రహ ప్రతిష్టాపనకు భూమి పూజ

**అల్లాదుర్గం, అక్టోబరు 24, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని ఐబి చౌరస్తా చమాన్ వద్ద వాల్మీకి విగ్రహ ప్రతిష్టాపనకు ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో గురువారం భూమి పూజ నిర్వహించారు. పూజలు నిర్వహించి జెండాను ఆవిష్కరించారు. మండలంలోని ఆయా గ్రామాల్లోని ముదిరాజ్‌లు పూజా కార్యక్రమానికి చేరుకుని జయ జయ ధ్వనలు చేస్తుండగా పూజా కార్యక్రమాలు భక్తి శ్రద్దలతో నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ ఎం బేతయ్య, మాజీ ఎంపిటిసి సభ్యులు ఏ దశరథ్‌లు మాట్లాడుతూ ముదిరాజ్‌లు ప్రతి గ్రామంలో ఐక్యతతో ఉంటేనే తమ హక్కులను సాధించుకునే అవకాశం ఉంటుందన్నారు. రాజకీయ పార్టీలు ముదిరాజ్‌ను ఓటర్లుగా వాడుకుంటున్నారే కాని తమ అభివృద్ధికి సహకరించడం లేది విచారం వ్యక్తం చేశారు. ముదిరాజ్‌లు బిసి(డి) గ్రూపులో ఉన్నందునే అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంటున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. ముదిరాజ్‌లను బిసి (డి) నుంచి బిసి (ఏ) గ్రూపులోకి మార్చాలని డిమాండ్ చేశారు. ముదిరాజ్‌లు అక్షరాస్యతలో వెనుకంజలో ఉన్నారని, అందుకు ప్రతి ముదిరాజ్ చిన్నారులు విద్యను అందుకునేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో అల్లాదుర్గం ముదిరాజ్‌లతో పాటు మండలంలోని ఆయా గ్రామాల ముదిరాజ్‌లు పాల్గొన్నారు.


అల్లాదుర్గం ఐబి చౌరస్తాలో వాల్మీకి విగ్రహ ప్రతిష్టాపనకు భూమి పూజ చేస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు


టిఎన్‌జివో రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న జిల్లా నేతలు

## సిద్దిపేట జిల్లాను చార్మినార్ జోన్‌లో కలపాలి
### వినతిపత్రం అందజేసిన టిఎన్‌జివో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** టిఎన్జీవో కేంద్ర సంఘం అధ్యక్షులు శ్రీమరం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ముజీబ్ హుస్సేన్‌లకు హైదారాబాద్‌లోని నాంపల్లి కార్యాలయంలో గురువారం సిద్దిపేట జిల్లాను చార్మినార్ జోన్‌లో కలిపేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా టిఎన్జీవో అధ్యక్షులు గ్యాదరి పరమేశ్వర్, కార్యదర్శి కొమాండ్ల విక్రమ్‌రెడ్డిలు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్బంగా రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సానుకూలంగా స్పందిస్తూ అన్ని విషయాలు పరిశీలించి నిర్ణయం తీసుకుని సిఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని తెలిపినట్లు పరమేశ్వర్, విక్రమ్‌రెడ్డిలు తెలిపారు. సిద్దిపేట జిల్లా ఉమ్మడి మెదక్ జిల్లాలో సంగారెడ్డి జిల్లా చార్మినార్ జోన్లో మెదక్, సిద్దిపేట,రాజన్న సిరిసిల్ల జోన్‌లో కలపడం వలన ఉద్యోగులు పదోన్నతులు పొందడంలో తదితర విషయాలలో నష్టపోతున్నారని వివరించారు. 317 ఉప సంఘంలో సభ్యులైన మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సైతం వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. మంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు. హైదారాబాద్‌కు అతి సమీపంలో ఉన్న సిద్దిపేట జిల్లాను రాజన్న సిరిసిల్ల జోన్‌లో కలపడం ఏరకంగా సహేతుకం కాదన్నారు. జిల్లాను చార్మినార్ జోన్‌లో కలపడం ద్వారా ఉద్యోగులకు,నిరుద్యోగులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. త్వరలోనే ఉమ్మడి జిల్లా మంత్రితో పాటు జిల్లా ఇంచార్జి మంత్రికి వినతి పత్రాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు పోతుల సత్యనారాయణ, అజీమ్, సాయి, రమేష్ ఉన్నారు.

## తిరుపతి సర్వీసు వేళల్లో మార్పులు : డిఎం

**జహీరాబాద్, అక్టోబరు 24, ప్రభాతవార్త:** జహీరాబాద్ డిపో నుంచి హైదరాబాద్, కర్నూల్ మీదుగా తిరుపతికి వెళ్లే సూపర్ లగ్జరీ బస్సు వేళల్లో మార్పులు చోటుచేసుకున్నాయని డిపో మేనేజర్ జాకీర్ హుస్సేన్ తెలిపారు. ప్రస్తుతం సర్వీసు సాయంత్రం 6 గంటలకు డిపో నుంచి బయలు దేరి ఉదయం 8గంటల వరకు చేరుకుని తిరిగి రాత్రి 8గంగల 50 నిమిషాలకు తిరుపతి నుంచి బయలు దేరి ఉదయం10.3 గంటలకు జహీరాబాద్ డిపోకు చేరుకుంటోందన్నారు. ఇకపై ఈ నెల 26వ తారీఖు నుంచి మధ్యాహ్నం 1.15 గంటలకు జహీరాబాద్ నుంచి బయలెక్కి తెల్లవారు జాము 3.30 గంటలకు తిరుపతి చేరుకుంటుందన్నారు. తిరుపతి నుంచి ఉదయం 9 గంటలకు బయలెక్కి జహీరాబాద్‌కు రాత్రి 10.45 గంటలకు చేరుకుంటుందన్నారు. బస్సు వేళల్లో మార్పును గమనించి ప్రయాణీకులు తమ టిక్కెట్‌లను రిజర్వు చేసుకోవాలని డిపో మేనేజర్ సూచించారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో గుర్తు తెలియని వ్యక్తి హత్య

### నిందితులను పట్టుకుంటాం : డిఎస్‌పి వెంకట్‌రెడ్డి

**చిన్నశంకరంపేట, అక్టోబరు 24, ప్రభాతవార్త:** గురువారం చిన్నశంకరంపేటలో తీవ్ర కలకలకం రేగింది. వైద్య ఆరోగ్య కేంద్రంలోనే గుర్తు తెలియని యువకుడిని అతి కిరాతకంగా కొట్టి చంపి ఆపై కాల్చివేసేందుకు ప్రయత్నించారు దుండగులు. తూప్రాన్ డీఎస్పీ వెంకటరెడ్డి కథనం ప్రకారం.. పట్టణంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఉదయం తెరవడానికి వైద్య అధికారి సాయిసింధూ, ఆసుపత్రి సిబ్బంది వెళ్లారు. ఆసుపత్రి వెనుక భాగంలో ఉన్న తలుపు తెవరగానే గుర్తు తెలియని యువకుడు కాలిపోయి ఉన్న స్థితిలో కనిపించడంతో వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే రామాయంపేట సీఐ వెంకటరాజాగౌడ్, చిన్నశంకరంపేట ఎస్ఐ నారాయణగౌడ్‌లు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. యువకుడిని వెకువజామున గుర్తు తెలియని దుండగులు బండరాయితో కొట్టడంతో చనిపోయాడని, యువకుడు మృతి చెందాడని నిర్ధారించుకున్నాక ఆసుపత్రిలో మొక్కల రక్షణకు ఉంచిన ట్రీ గార్డులను యువకుడిపై వేసి కాల్చారు. యువకుని ఒంటిపై తీవ్ర గాయాలున్నాయని, మొఖం గుర్తుపట్టలేని స్థితిలో ఉందని డీఎస్పీ తెలిపారు. క్లూస్‌టీంలు ఆధారాలను సేకరించారు. ఉద్దేశపూర్వకంగా చంపారా, ఆసుపత్రిలోకి తీసుకరావడానికిగల కారణాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. సీసీ కెమెరాలను పరిశీలించి నిందితులను పట్టుకుంటామని డీఎస్పీ తెలిపారు. వైద్యాధికారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. సాక్షాత్తు ఆసుపత్రిలోనే ఇటువంటి సంఘటన జరగడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ వెంకట్‌రెడ్డి


వినతిపత్రం అందజేస్తున్న చాడ వెంకటరెడ్డి

## భూ నిర్వాసితుల సమస్యలను పరిష్కరించండి
### రాష్ట్ర నీటి పారుదల శాఖ ముఖ్య సలహాదారుకు విన్నవించిన చాడ వెంకటరెడ్డి

**హుస్నాబాద్ రూరల్, అక్టోబరు 24, ప్రభాతవార్త :** మెట్ట ప్రాంతమైన హుస్నాబాద్ నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేసేందుకు నిర్మిస్తున్న గౌరవెల్లి ప్రాజెక్టులో భూములు కోల్పోయిన నిర్వాసితుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు,హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం సమస్యను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర నీటి పారుదల శాఖ ముఖ్య సలహాదారులు ఆదిత్యనాథ్, ఈఎన్‌సి అనిల్‌కుమార్‌లకు వినతిపత్రాన్ని అందజేశారు.గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో ముంపుకు గురైన నిర్వాసితులకు అన్యాయం జరిగిందని, ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతీ నిర్వాసితునికి నష్ట పరిహారం అందిచి ఆదుకోవాలన్నారు.వినతి పత్రం అందించిన వారిలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నరసింహా,పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు గడిపె మల్లేష్,మాజీ జడ్పిటిసి స్వామితో పాటు తదితరులు ఉన్నారు.

## పోలీసులు, విద్యార్థులకు వ్యాసరచన పోటీలు


పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎసిపి సతీష్

**హుస్నాబాద్ రూరల్, అక్టోబరు 24,ప్రభాతవార్త :** పోలీస్ అమర వీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా గురువారం హుస్నాబాద్ పోలీస్ స్టేషన్‌లోని కానిస్టేబుల్ నుండి ఏఎస్ఐ వరకు, పట్టణంలోని పలు పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు ఎసిపి వాసాల సతీష్ తెలిపారు.ఈ సందర్బంగా నిర్వహించిన పరీక్షలలో పోలీసులకు 'సమాజంలో పోలీసుల ప్రతిష్ట' అనే అంశం ఇవ్వగా విద్యార్థులకు 'విచక్షనతో కూడిన మొబైల్ వాడకం, తెలంగాణ రాష్ట్రాన్ని డ్రగ్ రహిత రాష్ట్రంగా మార్చేందుకు నా పాత్ర' అనే అంశాలను ఇచ్చినట్లు వారు సూచించారు. ఈ సందర్బంగా నిర్వహించిన పరీక్ష పోటీలు ఆన్‌లైన్ నిర్వహించామని ఇందులో ప్రతిభ చూపిన ముగ్గురు పోలీసులతోపాటు ముగ్గురు విద్యార్థులకు రాష్ట్రస్థాయికి ఎంపిక చేసి పోలీస్ కమిషనర్ అనురాధ చేతులమీదుగా బహుమతులు అందించనున్నట్లు చెప్పారు. పోటీ పరీక్ష కేంద్రాలను సీఐ కోంద్ర శ్రీనివాస్, ఎస్ఐ తోట మహేష్ సందర్శించి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ విజయగిరి బిక్షపతి, వైస్ ప్రిన్సిపాల్ కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

## జివో 29ని ఉపసంహరించుకోవాలి
### -డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్


మాట్లాడుతున్న శంకర్

**గజ్వేల్, అక్టోబరు 24 (ప్రభాతవార్త):** పంతాలకు, పట్టింపులకు పోకుండా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జివో 29ని ఉపసంహరించుకోవాలని డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ పేర్కొన్నారు. గురువారం గజ్వేల్ పట్టణంలో మాట్లాడుతూ కులం కారణంగా ఎస్సీ,ఎస్టీ,మైనార్టీలు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా వెనుకబడిన పేదలకు బాబాసాహెబ్ అంబేద్కర్ రిజర్వేషన్ తీసుకువస్తే ఈ స్ఫూర్తిని దెబ్బతీసేవిధంగా ప్రధానమంత్రి ఈడబ్ల్యుఎస్ పేరుతో తక్కువ జనాభా ఉన్న కులాలకు ఎక్కువ రిజర్వేషన్ వచ్చే విధంగా చేసి పేద వర్గాల పొట్ట కొట్టారన్నారు. అగ్ర కులాలకు రిజర్వేషన్ దోచిపెడితే రాష్ట్ర ముఖ్యమంత్రి ఒక అడుగు ముందుకు వేసి జివో 29 తీసుకురావడం వల్ల గ్రూప్-1 పరీక్షల్లో 5,300 మంది ఎస్సీ, ఎస్టీ, బిసి అధ్యక్షులు అనర్హులు అయ్యారన్నారు. 563 పోస్టులకు 1:50 చొప్పున అభ్యర్థులను ప్రకటించడం అన్యాయమన్నారు. మొత్తం పోస్టుల్లో 354 రిజర్వు పోస్టులు ఉంటే జివో 29 వల్ల ఓపెన్ కేటగిరిలో రిజర్వ్ అభ్యర్థులను రిజర్వ్ కేటగిరిలో చేర్చడం అన్యాయమన్నారు. ఎస్సీ,ఎస్టీ,బిసి వర్గాల అభ్యర్థులు 1:50 చొప్పున అర్హత సాధిస్తే ఓసి వర్గాలు 1:65 శాతం మేర అర్హత సాధించారన్నారు. జివో 29 రాజ్యాంగస్ఫూర్తికి వ్యతిరేకమని, దానిని తక్షణమే ఉపసంహరించుకోవాలని శంకర్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఏగొండస్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి బ్యాగరి వేణు పాల్గొన్నారు.

## రక్తదానం ప్రాణ దానంతో సమానం : ఎస్ఐ

**కోహెడ, అక్టోబరు 24, ప్రభాతవార్త :** రక్తదానం ప్రాణదానంతో సమానమని ఎస్ఐ అభిలాష్ అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా గురువారం కోహెడ పోలీసుల ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఆరోగ్యవంతులైన యువతి యువకులు రక్తదానం చేయడానికి ముందుకు రావాలన్నారు. రక్తదానంతో ఎలాంటి అనారోగ్య సమస్యలు రావన్నారు. రక్తదానం సామాజిక సేవా కార్యక్రమన్నారు. పోలీసుల ప్రాణ త్యాగాలు వెలకట్టలేనివన్నారు. అమరుల త్యాగ ఫలంగానే దేశ, రాష్ట్ర ప్రజలందరూ శాంతియుతంగా, ప్రశాంతంగా ఉన్నారని తెలిపారు. అనంతరం రక్తదానం చేసిన వారి ఎస్ఐ అభిలాష్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందజేసి అభినందించారు.

## నాగ్వార్‌లో వ్యక్తి అదృశ్యం

**రాయికోడ్, అక్టోబరు 24, ప్రభాతవార్త:** మండల పరిధిలోని నాగ్వార్ గ్రామానికి చెందిన మహమ్మద్ యూసుఫ్ (49) ఈనెల 18వతేదీనుంచి కనిపించడంలేదని ఎస్ఐ నారాయణ తెలిపారు. ఎస్ఐ నారాయణ కథనం ప్రకారం మహమ్మద్ యూసూఫ్ ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లి ఇంటికి తిరిగిరాలేదన్నారు. యూసుఫ్ ఆచూకి కోసం బంధువులు, సన్నిహితుల వద్ద గాలించినా ఫలితం లేకపోవడంతో గురువారం అదృశ్యమైన వ్యక్తి కుమారుడు మహమ్మద్ ఆరీఫ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నారాయణ వివరించారు.




నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

## రెవెన్యూ డివిజన్ చేసేవరకు పోరాటం

**చేర్యాల, అక్టోబరు 24, ప్రభాతవార్త :** చేర్యాలను రెవెన్యూ డివిజన్ చేసేవరకు పోరాటం నిర్వహిస్తామని ఎస్ఎఫ్ఐ సిద్దిపేట జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆముదాల రంజిత్‌రెడ్డి, దాసరి ప్రశాంత్ అన్నారు. చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని గురువారం ఎస్ఎఫ్ఐ చేర్యాల డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో పాతబస్టాండ్ జాతీయ రహదారిపై నిరసన తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ తొమ్మిది సంవత్సరాలుగా చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని అనేక పోరాటాలు నిర్వహించినా గత బిఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. కాగా అసెంబ్లీ ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జనగామ సభలో అధికారంలోకి వచ్చిన నెలరోజుల్లో చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటిస్తామని తెలిపి, పది నెలలైనా ప్రకటించకపోవడం సరైంది కాదన్నారు. ఇప్పటికైన ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో తాడూరు భరత్‌కుమార్, విక్రమ్, ప్రసాద్, రంజిత్, రాజు, శివ, ప్రశాంత్, ప్రవీణ్, భరత్, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



వడ్డేపల్లిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

**రాయపోల్, అక్టోబరు 24, ప్రభాతవార్త :** ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్, ఎపిఎం కిషన్ అన్నారు. గురువారం రాయపోల్ మండల పరిధిలోని గొల్లపల్లి, రాంసాగర్, అంకిరెడ్డిపల్లి, వడ్డేపల్లి, ఎల్కల్ గ్రామాల్లో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు కష్టపడి పండించిన ధాన్యాన్ని దళారులకు విక్రయించ కుండా ప్రభుత్వ ఏర్పాటు కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఐకెపి సీసీలు రాజేశ్వరావు, ప్రవీణ్‌కుమార్, కిష్టయ్య, రవీందర్, వివిధ గ్రామాల నాయకులు, రైతులు పాల్గొన్నారు

## వికలాంగుల పోరాట సమితి మండల అధ్యక్షుడిగా వసంత



వికలాంగుల హక్కుల పోరాట సమితి పాలకవర్గం దృశ్యం

**అక్కన్నపేట, అక్టోబరు 24, ప్రభాతవార్త :** వికలాంగుట హక్కుల పోరాట సమితి మండల అధ్యక్షుడిగా గుబ్బడి గ్రామానికి చెందిన యాటపోలు వసంతను ఎన్నుకున్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సంఘం సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సమావేశంలో అధ్యక్షుడిగా వసంత, ఉపాధ్యక్షుడిగా జీల సదయ్య, ప్రధాన కార్యదర్శిగా పీరెల్ల అశోక్, కోశాధికారిగా నార్లపురం సమ్మయ్యలను ఎన్నుకుఎన్నట్లు సంఘం సభ్యులు ప్రకటించారు. నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన వసంత మాట్లాడుతూ తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలు సక్రమంగా నిర్వహిస్తానని, తన నియామకానికి సహకరించిన ప్రతీ ఒక్కరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు గుగులోతు రాజేశ్వరి, జిల్లా అధ్యక్షులు సమ్మయ్య, నియోజకవర్గ అధ్యక్షులు యచిర బోయిన రమేష్, ఉపాధ్యక్షులు కనగండ్ల లక్ష్మి, నాయకులు ఎల్లయ్య, కర్ణకంటి పుష్ప, తంగనపల్లి చిన్న భూమయ్య, గుండ అశోక్, యాదవ్వ పాల్గొన్నారు.

## మహిళలు స్వశక్తితో ఎదగాలి : సిసి దేవరాజ్

**జగదేవ్‌పూర్, అక్టోబరు 24 (ప్రభాతవార్త):** మహిళలు స్వశక్తితో ఎదగాలని జగదేవ్‌పూర్ మండలం చాట్లపల్లి ఐకెపి క్లస్టర్ సిసి దేవరాజ్ అన్నారు. గురువారం చాట్లపల్లి గ్రామంలో ఇందిర మహిళా శక్తి పథకంలో భాగంగా లబ్ధిదారులకు కోడిపిల్లలను పంపిణీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మహిళలు ఆర్థికంగా ప్రగతి సాధించాలనే ఉద్దేశంతో కోడి పిల్లలను ఇందిరా మహిళా శక్తి పథకం కింద పంపిణీ చేసిందని తెలిపారు. ఆరు వారాల కోడిపిల్లకు రూ.105 లబ్ధిదారు చెల్లించాల్సి వుంటుందని, ఈ విధంగా మండలంలోని జగదేవ్‌పూర్, చాట్లపల్లి, జంగంరెడ్డిపల్లి, తీగుల్‌నర్సాపూర్, అంతాయగూడ, ధర్మారం, కొత్తపేట, వెంకటాపూర్ బిజి, రాయవరం, బస్వాపూర్, తిమ్మాపూర్ గ్రామాల లబ్ధిదారులకు సంతోష మండల మహిళా సమాఖ్య ద్వారా 1445 సొనాలి జాతి కోడి పిల్లలను అందజేసినట్లు తెలిపారు. ఇట్టి కోడి పిల్లలను లబ్ధిదారులు పెంచి ఆర్థికంగా లాభాలు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో సిసి అరుణ, అకౌంటెంట్ షబానా, వివోఏలు సుదర్శన్, కవిత, వెంకటమ్మ, చాట్లపల్లి గ్రామ సంఘం అధ్యక్షురాలు గడ్డం రేణుక, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యం

**-మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి**

**గజ్వేల్ టౌన్, అక్టోబరు 24 (ప్రభాతవార్త):** అన్ని వర్గాల ప్రజలకు కాంగ్రెస్ పార్టీతోనే న్యాయం జరుగుతుందని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో తెలంగాణ రాష్ట్రం గణనీయమైన అభివృద్ధి సాధిస్తుందని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. గురువారం గజ్వేల్ మండలం అక్కారం గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు, మాజీ వార్డు సభ్యులు బుడిగె ఎల్లం, అల్వాల లక్ష్మి నర్సింలు, ఎర్రవల్లి బాబు, పంజా నరేష్, కటకం రాజు, బుడిగె ఎల్లం, డప్పు ప్రశాంత్, బుడిగె లక్ష్మణ్ తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి నర్సారెడ్డి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్ మాజీ సర్పంచ్ సుఖేందర్‌రెడ్డి, ఏఎంసి డైరెక్టర్ యాదగిరి, అక్కారం గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాజు, నాయకులు రామాగౌడ్, మాజీ ఎంపిటిసి కవిత రాజు, నీలారెడ్డి, మన్సూర్, నరేష్‌గౌడ్, కోనాపూర్ యాదగిరి, గౌలికర్ రాజు, హనుమంత్, రమేష్, పోచయ్య, ప్రసాద్, యాదగిరి పాల్గొన్నారు.



కాంగ్రెస్‌లో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పుతున్న నర్సారెడ్డి

# రహదారులపైనే ధాన్యం ఆరబోత

### ప్రమాదాల బారిన వాహనదారులు... పట్టించుకోని అధికారులు



ధాన్యం కుప్పను రోడ్డుపై నల్లటి కవర్ కప్పిన దృశ్యం

**చిన్నశంకరంపేట, అక్టోబరు 24, ప్రభాతవార్త:** ఆరుగాలం పండించిన పంటకు తగిన ఫలితం దక్కేందుకు అన్నదాతలు అహర్నిశలు కృషిచేస్తారు. వానాకాలం సీజన్‌కు సంబంధించి పంట చేతికొస్తుంది. ఇప్పటికే కొందరు కోతలు ప్రారంభించారు. ధాన్యాన్ని తెచ్చి రహదారులపై పోసి ఎండబెడుతున్నారు. దీంతో రోడ్లన్నీ కల్లాలను తలపిస్తున్నాయి. ధాన్యం కుప్పలే మృత్యుమార్గాలు అవుతున్నాయి. సగం రోడ్డును వడ్ల కుప్పలే ఆక్రమిస్తుండటంతో ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయి. రైతులు ధాన్యాన్ని ఆరబోయడానికి సమీపంలోని రోడ్లను కల్లాలుగా వాడుకుంటున్నారు. ఉదయం ఆరబోసిన ధాన్యాన్ని సాయంత్రం కుప్పలుచేసి రాత్రిళ్ల అక్కడే ఉంచుతున్నారు. రాత్రి సమయంలో కుప్పలు గమనించకపోడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. చిన్నశంకరంపేట మండలం గజగట్లపల్లికి చెందిన రమేష్ స్థానికంగా ఉన్న పరిశ్రమలో పని చేస్తున్నాడు. ఆదివారం రాత్రి విధులు ముగించుకొని గ్రామానికి బైక్‌పై వస్తుండగా దగ్గరకు వచ్చే వరకు రోడ్డుపై ఉన్న ధాన్యం కుప్ప కనిపించకపోవడంతో ద్విచక్రవాహనం కుప్పపైకి ఎక్కి పది అడుగుల దూరంలో ఎగిరిపడ్డాడు. ఈ ప్రమాదంలో రమేష్ ఎడమచెవి సగబాగం తెగిపోయింది. ఎడమ పక్క ఎముక విరిగింది. స్థానికులు గవ్వలపల్లిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. సోమవారం మెదక్ ఆసుపత్రికి తరలించగా వైద్యులు మెరుగైన వైద్యం నిమిత్తం మెదక్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు మూడునెలల పాటు విశ్రాంతి తీసుకోవాలని సూచించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఒక్కగానొక్క కొడుకు రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలు కావడంతో వారు తీవ్రంగా ఆవేదన చెందుతున్నారు.

### ప్రాణాలు పోతున్న పట్టించుకోరా....

**సాయిబాబ, గజగట్లపల్లి**

ధాన్యం రోడ్లపై ఆరబోస్తుండటంతో నిత్యం వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. కొన్ని సమయాల్లో ప్రాణాలు పోతున్నాయి. రోడ్లపై పంటలను ఆరబెట్టకుండా, నూర్పిడిలు చేపట్టకుండా పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాలి.

### రాత్రివేళ ప్రయాణమంటేనే భయమేస్తుంది...

**పడిగాచి సామ్రాట్, చిన్నశంకరంపేట**

బైక్‌పై పనులు ముగించుకొని రాత్రి సమయాల్లో ఇంటికి వెళ్తుంటా.. ఈ సీజన్‌లో రాత్రివేళ బైక్ నడపాలంటే భయమేస్తుంది. రోడ్లపై కుప్పలపై నల్లటి కవర్లు కప్పడంతో రాత్రి సమయంతో బీటి రోడ్డు మాదిరిగానే కనిపిస్తుంది. వాహనదారులు గమనించక పోతే ప్రమాదానికి గురి కావలిసిందే. రోడ్లపై కల్లాలు చేయకుండా రైతులకు అవగాహన కల్పించాలి.

### ధాన్యం కుప్పలు రోడ్డుపై పోస్తే చర్యలు

**ఎస్ఐ నారాయణగౌడ్**

మండల వ్యాప్తంగా రైతులు ధాన్యాన్ని రోడ్డుపై ఆరబోసి ప్రమాదాలకు కారణం కాకూడదని చిన్న శంకరంపేట ఎస్ఐ నారాయణగౌడ్ అన్నారు. రైతులు ఎవరూ రోడ్డుపై ధాన్యం ఆరబోయరాదని హెచ్చరించారు. కొన్నిసార్లు చూసుకోక ధాన్యం కుప్పలపై వాహనం నడిపే ఆస్కారంతో పాటు ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. రాత్రి వేళల్లో వాహనదారులు ఆ ధాన్యం కుప్పలను చూడరని, రైతులు రోడ్డుపై ధాన్యాన్ని ఆరబోయవద్దని చెప్పారు. ప్రాణాలను నమ్ముకొని వారి కుటుంబాలు ఉంటాయన్నారు. ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. ధాన్యం కుప్పలను వెంటనే తొలగించాలని లేనిపక్షంలో చర్యలు తీసుకుంటాం.



శేఖర్‌గుప్తను శాలువాతో సన్మానిస్తున్న నర్సారెడ్డి

## ఆర్యవైశ్యుల అభ్యున్నతికి కృషి : మాజీ ఎమ్మెల్యే

**గజ్వేల్, అక్టోబరు 24 (ప్రభాతవార్త):** అర్యవైశ్యుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తుందని మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. గురువారం కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డిని ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన జగ్గయ్యగారి శేఖర్‌గుప్త, పట్టణ అధ్యక్షుడిగా ఎన్నికైన అత్తెల్లి శ్రీనివాస్‌గుప్తలు కలిశారు. ఈ సందర్భంగా నర్సారెడ్డి మాట్లాడుతూ ఆర్యవైశ్యుల సంక్షేమం కోసం రేవంత్‌రెడ్డి పనిచేస్తున్నారని, ఆర్యవైశ్యుల సమస్యలు తీర్చేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన జగ్గయ్యగారి శేఖర్, అత్తెల్లి శ్రీనివాస్‌లకు మిఠాయి తినిపించి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ మహంకాళి శ్రీనివాస్‌గుప్త, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు లక్ష్మయ్యగుప్త, కిరాణా వర్తక సంఘం అధ్యక్షుడు సిద్ధి బిక్షపతి, హరిహర పుత్ర అయ్యప్ప క్షేత్ర అధ్యక్షుడు శ్రీనివాస్‌గుప్త, మహాసభ నేతలు సూర ఆంజనేయులు, మల్యాల భద్రయ్య, అయిత సత్యం, కొండపాక శ్రీనివాస్, తేరాల రాజు, ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

## వరిగుంతంలో బిజెపి సభ్యత్వ నమోదు



బిజెపి సభ్యత్వ నమోదు దృశ్యం

కొల్చారం, అక్టోబరు 24 ప్రభాతవార్త: మండల పరిధిలోని వరిగుంతం గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ గురువారం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించిన బీజేపీ రాష్ట్ర నాయకులు వాల్దాస్ మల్లేష్ గౌడ్. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు దయాకర్ గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి నాని, మండల ఉపాధ్యక్షులు శ్రీకాంత్, బూత్ అధ్యక్షులు కృష్ణ, అరుణ్ గౌడ్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

**చిన్నశంకరంపేట, అక్టోబరు 24,ప్రభాతవార్త:** రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని చందంపేట సహకార సంఘం చైర్మన్ సత్యనారాయణ సూచించారు. గురువారం సహకార సంఘం పరిధిలోని రుద్రారం, ధర్పల్లి, భాగిర్తిపల్లి, చందంపేట, సూరారం గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు సిద్దిరాంరెడ్డి, దయానంద్, లక్ష్మణ్,శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్న దృశ్యం




ఎస్ఐ మహమ్మద్ గౌస్‌కు ఫిర్యాదు చేస్తున్న సాయి చరణ్

## నాపై దుష్ప్రచారం చేస్తే ఊరుకునేది లేదు

**-ఎంఎస్ఆర్ యువసేన అధ్యక్షుడు మన్నె సాయిచరణ్**

**కొల్చారం, అక్టోబరు 24 ప్రభాతవార్త:** నాకు రాష్ట్రంతోపాటు ఇతర రాష్ట్రంలో వ్యాపారులు ఉన్నాయి.. బాజాప్త ప్రభుత్వానికి ఆస్తి పన్ను చెల్లిస్తున్నా.. నన్ను వ్యక్తిగతంగా ఎదుర్కోలేక నాపై, నేను చేస్తున్న సేవా కార్యక్రమాలపై నిరాధారమైన తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, అలాంటి వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని, న్యాయపరంగా ఎదుర్కుంటామని ఎంఎస్ఆర్ యువసేన అధ్యక్షులు మన్నె సాయిచరణ్ అన్నారు. గురువారం తనపై నిరాధారమైన ఆరోపణలతో ఓ ఛానల్‌లో ప్రసారం చేసిన కథనంపై కొల్చారం పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ మహమ్మద్ గౌస్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సాయి చరణ్ మాట్లాడుతూ సేవా కార్యక్రమాలు చేస్తే ఇలా దుష్ప్రచారం చేయడం ఏంటని ప్రశ్నించారు. అందరి దగ్గర డబ్బులు ఉన్నాయి కానీ ఎవరు సేవా కార్యక్రమాలు చేయరు.. చేసే వాళ్లపై తప్పుడు ఆరోపణలు చేయడం ఏమిటని అన్నారు. పూర్తి ఆధారాలతో వచ్చాను, మీ దగ్గర ఏ ఆధారాలతో నా పై తప్పుడు కథనాలు ప్రసారం చేశారో చూపాలని డిమాండ్ చేశారు. తనపై తప్పుడు కథనాలు ప్రసారం చేసిన ఛానల్‌పై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

## రహదారులపై ధాన్యం ఆరబెట్టొద్దు : ఎస్ఐ

**కొల్చారం, అక్టోబరు 24 ప్రభాతవార్త:** నిత్యం వాహనాలతో రద్దీగా ఉండే నేషనల్ హైవే ప్రధాన రహదారిపై ధాన్యం ఆరబోయడంవల్ల ప్రమాదం జరిగే అవకాశం ఉందని ఎస్ఐ మహమ్మద్‌గౌస్ అన్నారు. గురువారం కొల్చారం పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో ఆయన మాట్లాడారు. నిత్యం ఏడుపాయలకు, అలాగే మెదక్ పట్టణంలోని చర్చికి వెళ్లే భక్తులతో కొల్చారం రహదారి వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటుందని అన్నారు. ప్రస్తుతం వరి కోతలు ప్రారంభమైన నేపథ్యంలో రోడ్లపైన ధాన్యం రాశులను ఆరబోయడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. అలాగే ధాన్యం రాశులపై నల్ల కలర్ టాపర్‌లను కప్పడం ద్వారా రాత్రి వేళల్లో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. ప్రమాదాల నివారణకు రైతులు సహకరించాలని కోరారు.

## నియంతలా వ్యవహరిస్తున్న మమత యాదగిరిపై చర్యలు తీసుకోవాలి

**-కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మల్లేశంగౌడ్**

**కొల్చారం, అక్టోబరు 24 ప్రభాతవార్త:** కొల్చారం మండలం రాంపూర్ గ్రామంలో అభివృద్ధిని అడ్డుకుంటూ నియంతలా వ్యవహరిస్తున్న మాజీ సర్పంచి, మాజీ ఎంపీటీసీ సామల మమతయాదగిరిపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నాగులగారి మల్లేశంగౌడ్ అన్నారు. మెదక్‌లో మెడికల్ కళాశాల ప్రారంభోత్సవానికి మంత్రులు దామోదర రాజనర్సింహ, కొండా సురేఖ వచ్చిన సందర్భంగా రాంపూర్‌లో బస్తీ దవాఖాన ఏర్పాటుకు నిధులు మంజూరు చేస్తానని చెప్పడంతో కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన నిర్వహించిన అనంతరం సమావేశం ఏర్పాటు చేసుకున్నాకా అనుమతి లేకుండా వచ్చి నాయకులపై దాడికి దిగిన అతనిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గజిని వెంకట్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, మారెల్లి అనిల్, రామ్ రెడ్డి, శ్రీశైలం, బండి మల్లేశం, వెంకటేశం, ఆగం గౌడ్, బద్య నాయక్, మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మల్లేశంగౌడ్

# ప్రజా సమస్యలపై ప్రశ్నించే గొంతుకగా పనిచేస్తాం

### బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కొత్తపల్లి ప్రభాకర్‌రెడ్డి

**గుమ్మడిదల, అక్టోబరు 24 ప్రభాతవార్త:** ప్రజా సమస్యల పరిష్కారానికి అందుబాటులో ఉంటూ ప్రశ్నించే గొంతుకగా పనిచేస్తామని నూతనంగా ఎన్నికైన బిఆర్ఎస్ పార్టీ గుమ్మడిదల మండల అధ్యక్షుడు కొత్తపల్లి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. గురువారం రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి, కోలన్ బాల్‌రెడ్డితోపాటు మండల నాయకులు,కార్యకర్తలు మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావును మర్యాద పూర్వకంగా కలవడానికి గుమ్మడిదల టోల్‌గేట్ నుండి ఉదయం 9 గంటలకు భారీ కాన్వాయ్‌తో బయలుదేరి వెళ్లి మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికైనందున ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్చం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుమ్మడిదల మండలంలో 13 గ్రామాల కార్యకర్తలను కలుపుకొని ఇంటింటికీ బిఆర్ఎస్ అనే పథకం ద్వారావెళ్లి కాంగ్రెస్ మోసపూరిత అధికారాన్ని ప్రజలకు తెలియపరుస్తూ ఏ విధంగా కాంగ్రెస్‌కు ఓటు వేసి ఏ విధంగా మోసపోయామో స్పష్టంగా తెలియజేసి రాబోయే కాలంలో అధికారంలోకి వచ్చే విధంగా ప్రచారం చేస్తూ వారికి అండగా ఉంటామని తెలిపారు. రైతులకు కేసీఆర్ ఏ విధంగా అండగా ఉంటూ రైతుభీమా, రైతుబంధు ఇస్తూ ఆదుకున్నారో, అదేవిధంగా ఈ ప్రభుత్వం కూడా ఇచ్చే వరకు కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాడదామని స్పష్టంచేశారు. మండలపరిధిలోని పలువురు నాయకులు మాట్లాడుతూ గుమ్మడిదల మండలంతోపాటు వివిధ మండలాల్లో ప్రజల సమస్యలపై ఎప్పటికప్పుడు ప్రశ్నించే గొంతుకగా పనిచేస్తూ ప్రజల్లో ఉంటామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ ప్రజాక్షేత్రంలో బీఆర్ఎస్ పార్టీ ఉనికిని కాపాడుకుందామని తెలిపారు.కార్యక్రమంలో మండల నాయకులు సంతోష్ రెడ్డి, ఆదర్శ్‌రెడ్డి, మాజీ సర్పంచులు, మాజీ వార్డు సభ్యులు, బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.



మాజీ మంత్రి హరీష్‌రావుతో బిఆర్ఎస్ నాయకులు



మాట్లాడుతున్న గ్రేసీబాయ్

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి

**-తహసీల్దార్ గ్రేసీబాయ్**

**పెద్దశంకరంపేట, అక్టోబరు 24 ప్రభాతవార్త:** మండల పరిధిలోని ఆయా గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని తహసీల్దార్ గ్రేసీబాయ్ సూచించారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో ఐకేపీ, పీఏసీఎస్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఐకేపీ ఆధ్వర్యంలో ఏడు, పీఏసీఎస్ ఆధ్వర్యంలో మూడు ధాన్యం కొనుగోలు కేంద్రాలను మండలంలో ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి గ్రామాలలో ఐకేపీ,పీఏసీఎస్ సిబ్బంది కొనుగోలు కేంద్రాలకు సంబంధించిన సామాగ్రిని సమకూర్చుకోవాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ శరణప్ప, ఐకేపీ ఏపీఎం గోపాల్, పీఏసీఎస్ సీఈవో రవీందర్, పీఏసీఎస్, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామాభివృద్ధికి కార్యదర్శులు సహకరించాలి : ఎంపిడివో



మాట్లాడుతున్న ఎంపీడీవో ఉమాదేవి

**గుమ్మడిదల, అక్టోబరు 24 ప్రభాతవార్త:** గ్రామాల్లో ప్రజలకు మౌలిక వసతులు కల్పించడంలో గ్రామ కార్యదర్శులు చురుగ్గా పనిచేయాలని ఎంపీడీవో ఉమాదేవి సూచించారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో అన్ని గ్రామాల కార్యదర్శులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె గ్రామ కార్యదర్శులను ఉద్దేశించి మాట్లాడుతూ ఆయా గ్రామాల్లోని ప్రజలకు మౌలిక వసతుల కల్పన కోసం గ్రామ కార్యదర్శులు చురుగ్గా పనిచేసి స్వచ్ఛమైన తాగునీరు, దోమల నివారణ, మురికి కాలువల శుభ్రత, పరిశుభ్రమైన వాతావరణం గ్రామాల్లో నెలకొనుటకు కావాల్సిన సదుపాయాలను సమకూర్చి ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామాభివృద్ధికి సహకరించాలని కోరారు. ముఖ్యంగా ప్రభుత్వంనుంచి వచ్చే పథకాలను ప్రజలకు చేరవేసి అభివృద్ధికి దోహదపడాలన్నారు. అలాగే ప్రజలు అనారోగ్యంతో బాధపడకుండా ఉండడానికి ఆరోగ్య చిట్కాల గురించి వివరించి ముందస్తుగా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో దయాకర్, అన్ని గ్రామాల కార్యదర్శులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ అభయ హస్తం నిధులను విడుదల చేయాలి

**-పుర్ర ప్రభాకర్, ఎర్రోళ్ల సంజీవయ్య**

**కొల్చారం, అక్టోబరు 24 ప్రభాతవార్త:** రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అబేద్కర్ అభయహస్తం పేరుతో స్వయం ఉపాధి రంగాలకు నిధులు కేటాయించాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జాతీయ ఉపాధ్యక్షులు పుర్ర ప్రభాకర్, ఎర్రోళ్ల సంజీవయ్యలు అన్నారు. ఈ సందర్భంగా గురువారం వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం స్వయం ఉపాధి రంగాలకు ఎటువంటి నిధులు విడుదల చేయలేదన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కంటే రెండు లక్షలు ఎక్కువగా ఇస్తామని చెప్పి ఒక కుటుంబానికి 12 లక్షల చొప్పున అంబేద్కర్ అభయహస్తం పేరుతో పథకాన్ని ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం పథకాన్ని వెంటనే ప్రారంభించి నిధులు విడుదల చేయాలని, ఎంపిక చేసే వారిలో తమ నిజాయితీని చాటుకోవాలని కోరారు. దళితులకు అసైన్‌మెంట్ భూములకు సంపూర్ణ పట్టాలు కలిగించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. వచ్చే నెల నవంబర్ 3వ తేదీన ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సదస్సు ఉంటుందని, ఆ సభకు ఎమ్మార్పీఎస్ నాయకులు, అనుబంధ సంఘాలు, అధిక సంఖ్యలో వచ్చి విజయవంతం చేయాలని కోరారు.

## మేడాలమ్మ తల్లిని దర్శించుకున్న ఎమ్మెల్యే



మేడాలమ్మ తల్లిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కెపి. వివేకానందగౌడ్

**గుమ్మడిదల, అక్టోబరు 24 ప్రభాతవార్త:** గుమ్మడిదల మండలం నల్లవల్లి అటవీ ప్రాంతంలోని మేడాలమ్మ తల్లిని గురువారం దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్న కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి. వివేకానందగౌడ్ కోరిన కోరికలు తీర్చే నల్లవల్లి మేడాలమ్మ దేవాలయం ఎంతో మహిమ గల క్షేత్రమని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, గుమ్మడిదల మాజీ సర్పంచి చిమ్ముల నరసింహారెడ్డి, మధుసూదన్ రెడ్డి, సంజీవ రెడ్డి, మల్లేష్ గౌడ్, చిమ్ముల మహిపాల్ రెడ్డి, పారిశ్రామిక వేత్త రాంబాబు, నల్తూరు యాదగిరి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## మాలల మహా పాదయాత్రను విజయవంతం చేయాలి

**జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి చందా శ్రీకాంత్**

**చేర్యాల, అక్టోబరు 24, ప్రభాతవార్త :** జాతీయ మాల మహానాడు ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ నేతృత్వంలో ఈనెల 25న భద్రాచలం నుంచి హైదరాబాద్ వరకు డిసెంబర్ 1 నాటికి మాలల మహా పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు సిద్దిపేట జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి చందా శ్రీకాంత్ తెలిపారు. పాదయాత్రలో రాష్ట్రంలోఉన్న మాలలందరు తరలివచ్చి విజయవంతం చేసి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దళితులను విడదీసే కుట్రని విరమించుకునేలా సత్తా చాటేందుకు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. డిసెంబర్ 1 హైదరాబాద్‌లో ఈసభ ముగింపు ఉంటుందన్నారు.

## పురుగు మందులు అధికంగా వాడవద్దు

**జగదేవ్‌పూర్, అక్టోబరు 24 (ప్రభాతవార్త):** రైతులు పంట పొలాల్లో పురుగు మందులను అధికంగా వాడవద్దని కోటిలింగాల ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ డైరెక్టర్ నర్సింలు అన్నారు. గురువారం జగదేవ్‌పూర్ మండల పరిధిలోని చిన్నకిష్టాపూర్, ఎల్లాయగూడ, చాట్లపల్లి గ్రామాల్లో స్టింగ్ బయోటెక్ కంపెనీ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తి ఏరేటప్పుడు మహిళలు మాస్కులు ధరించాలని, పై నుంచి కిందకు ఏరాలని సూచించారు. అదేవిధంగా స్టింగ్ బయోటెక్ కంపెనీ ప్రతినిధి ధనరాజ్ మాట్లాడుతూ రైతులు విరివిగా పురుగుమందులు వాడడం వల్ల భూమి నిస్సారవంతం అవుతుందని, అలా కాకుండా స్టింగ్ బయోటెక్ కంపెనీ ద్వారా అందించే క్లీన్ రైస్ ఇంపాక్ట్ ప్రొడక్ట్‌లను వాడడం వల్ల బాక్టీరియా వృద్ధిచెంది భూమిని సారవంతం చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

## నిత్యావసర వస్తువులు పంపిణీ

**హుస్నాబాద్ రూరల్, అక్టోబరు 24, ప్రభాతవార్త:** అనాథలు, వృద్ధులు, వికలాంగులను ఆదరించాలని బాలవికాస ప్రతినిధి పి.రాణి అన్నారు. గురువారం పట్టణంలోని బాలవికాస స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో రాజరాజేశ్వర ఫంక్షన్ హాల్‌లో అనాద వృద్ధులు వికలాంగులకు నిత్యావసర వస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాణి మాట్లాడుతూ బాల వికాస స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులురాలు బాలక్క విద్యార్థులు, అనాథ, వృద్ధులను ఆదుకుంటున్న విషయాలను గుర్తు చేశారు. కార్యక్రమంలో హుస్నాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితవెంకన్న, జిల్లా లైబ్రరీ చైర్మెన్ కేడం లింగమూర్తి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చిత్తారి పద్మ, కౌన్సిలర్లు బొజ్జ హరీష్, సింగిల్ విండో చైర్మెన్ బొలిశెట్టి శివయ్య, రాజిరెడ్డి, ఎండి హస్సన్ పాల్గొన్నారు.

Main-IV(MDK):Main-IV(MDK).qxd 10/24/2024 8:01 AM Page 1



## మట్టి-ఇసుక తొలగింపులతో ప్రమాదాలు



రోడ్డుమీద మట్టిని ఎత్తిపోస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

**రామాయంపేట, అక్టోబర్ 24, ప్రభాతవార్త:** రామాయంపేట మున్సిపాలిటీ కేంద్రంలో సిద్ధిపేట చౌరస్తా వద్ద రహదారిపై ఉన్న చెత్తా చెదారాన్ని, మట్టిని తొలగించారు. జనతా హోటల్ నుండి సిద్ధిపేట చౌరస్తా వరకు ప్రధాన రహదారిపై ఇరుపక్కల ఇసుకతో పాటు మట్టి పేరుకుపోయింది. ఈ రహదారి వెంట వెళ్లే ద్విచక్ర వాహనదారులు ప్రతిరోజు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. పెద్దపెద్ద వాహనాలు వెళ్లడం, దీంతో దుమ్ము రేగడం, వెనుక ఉన్న ద్విచక్ర వాహనదారుల కళ్లల్లో మట్టి పడడంతో ఒక సందర్భంలో ప్రమాదాలు కూడా జరిగాయి. సిద్ధిపేట చౌరస్తా వద్ద దుమ్మురేగి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ప్రభాతవార్త విలేకరి స్థానిక మున్సిపల్ చైర్మెన్ పల్లె జితేందర్‌గౌడ్ దృష్టికి తీసుకుపోవడంతో ఆయన స్పందించి గురువారం ఉదయం మున్సిపల్ కార్మికులను అక్కడికి పంపించి, చెత్తా చెదారాన్ని తొలగించారు. దీంతో కొంతవరకు సమస్య తీరినట్లు అయింది.

## విద్యుత్ షాక్ తగిలి రైతు మృతి

**రామాయంపేట, అక్టోబర్ 24, ప్రభాతవార్త:** రామాయంపేట మండలం ఝాన్సీ లింగాపూర్ గ్రామంలో విద్యుత్ షాక్‌తో యువరైతు మృతిచెందిన సంఘటన చోటుచేసుకుంది. ఝాన్సీ లింగాపూర్ గ్రామానికి చెందిన చాకలి నాగరాజు (38) అనే యువకుడు గురువారం ఉదయం తన వ్యవసాయ పొలం బోరు వద్దకు వెళ్లడం జరిగింది. పొలం వద్ద విద్యుత్ తీగ తెగిపోవడంతో స్టార్టర్ సరిచేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు రామాయంపేట ఎస్సై బాలరాజ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## సిపిఎం పార్టీ జిల్లా నేత మృతి

**రామాయంపేట, అక్టోబర్ 24, ప్రభాతవార్త:** రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలోని గొల్పర్తి గ్రామానికి చెందిన సిపిఎం పార్టీ నాయకుడు లింగొల్ల సత్యం గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం చనిపోయాడు. గతంలో సత్యం సిపిఎం పార్టీలోను, సిఐటియూలో అనేక ఉద్యమాలలో పనిచేశాడు. అలాగే సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యునిగా కూడా ఆయన పనిచేశారు. అదేవిధంగా కార్మిక సంఘాలలో కార్మికుల కోసం, అంగన్వాడి సమస్యల కోసం జరిగిన ఉద్యమాలలో పాల్గొన్నారు. ప్రజాసమస్యల కోసం పోరాటం చేసిన కామ్రేడ్‌గా రామాయంపేట మండలంలోనే కాకుండా జిల్లాలో ఆయన అలుపెరుగని పోరాటాలు చేశారని, ఆయన చేసిన సేవలు మరువలేమని పార్టీ నాయకులు తెలిపారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించారు. బీడీ కార్మికుల సమస్యల కోసం జరిగిన ఆందోళనలు, ప్రభుత్వవ్యతిరేక ఉద్యమంలో ఆయన ప్రజలపక్షాన ముందు నిలబడి నడిపించేవారని ప్రజలు చెబుతున్నారు. అసంఘటిత కార్మికులకు బాసటగా నిలిచి లేబర్ ఐడి కార్డులు, ప్రమాద బీమా సౌకర్యాలు కల్పించుటలో ఆయన చేసిన కృషి అనన్య సామాన్యమైనదని తోటి కార్మికులు తెలిపారు. ఆయన మరణం పీడిత అసంఘటిత కార్మికులకు, పార్టీకి తీరని లోటని పలువురు వ్యాఖ్యానించారు.

## డిజిటల్ క్రాప్ సర్వే ప్రారంభం

**రామాయంపేట మున్సిపాలిటీ, అక్టోబర్ 24, ప్రభాతవార్త:** రాష్ట్ర స్థాయి వ్యవసాయ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గురువారం రామాయంపేట వ్యవసాయ డివిజన్ పరిధిలో డిజిటల్ క్రాప్ సర్వే ప్రారంభించినట్లు రామాయంపేట ఇంఛార్జ్ సహాయవ్యవసాయ సంచాలకులు రాజ్‌నారాయణ తెలిపారు. ఈ సందర్భంగా రామాయంపేటలో నిర్వహిస్తున్న డిజిటల్ క్రాప్ సర్వేను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రామాయంపేట వ్యవసాయ డివిజన్ వ్యాప్తంగా 14 క్లస్టర్లలో వ్యవసాయ విస్తీర్ణాధికారులు క్షేత్రస్థాయిలో రైతుల యొక్క సర్వే నంబర్లు, సబ్ డివిజన్లవారీగా డిజిటల్ పంట నమోదు కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. ప్రత్యేకంగా రూపొందించినటువంటి యాప్ ద్వారా డిజిటల్ క్రాప్ సర్వే నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. క్షేత్రస్థాయిలో ఏర్పడినటువంటి వివిధ సాంకేతికపరమైన ఇబ్బందులను ఉన్నతస్థాయి అధికారులకు తెలియజేయడం జరుగుతుందని పేర్కొన్నారు. తద్వారా క్లస్టర్‌వారీగా మండలాలవారీగా ఎంత విస్తీర్ణంలో పంటలు పండిస్తున్నారు, దిగుబడి అంచనా, వచ్చే సీజన్‌కు సంబంధించి ఎరువులు, విత్తనాల ప్రణాళిక చేసుకోవడానికి ఈ సర్వే ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు.

## బివిఆర్ఐటి కళాశాలలో రక్తదాన శిబిరం

**నర్సాపూర్ అక్టోబర్ 24. ప్రభాతవార్త:** నర్సాపూర్ సమీపంలోని బివిఆర్ఐటి ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని కళాశాల ప్రిన్సిపాల్ సంజయ్‌దూబే, కళాశాల డైరక్టర్ లక్ష్మీప్రసాద్, ఎస్‌విఇఎస్ డైరక్టర్ రవీంద్రబాబు, హెచ్‌ఓడి డాక్టర్ దశరథరామయ్య, సందీప్‌లు ఈ రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ రక్తదాన శిబిరంలో విద్యార్థులు, కళాశాల సిబ్బంది, స్థానికులు అందరు కలిసి సుమారు 250మందికి పైగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతున్న వారికి సకాలంలో రక్తం అందజేయడమే ఈ కార్యక్రమం ముఖ్యోద్దేశ్యమన్నారు. రక్తదానం వల్ల రక్తం అత్యవసరమైన వారికి, సకాలంలో ప్రాణాలు కాపాడడానికి ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా సమాజానికి ఉప యోగపడే కార్యక్రమాలు చేయడం అభినందనీయమని అన్నారు. ఈ రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

## సిఎంఆర్ఎఫ్ చెక్కును అందచేసిన ఎమ్మెల్యే

**మనూర్, అక్టోబరు 24, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన మనూర్ గ్రామానికి చెందిన సుగుణమ్మ అనారోగ్యానికి గురికావడంతో మెరుగైన కార్పోరేట్ చికిత్స అందుకునేందుకు 14వేల 5వందల రూపాయల సిఎంఆర్ఎఫ్ చెక్కును మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి గురువారం అందచేశారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షులు విఠల్‌రావు పాటిల్, మాజీ జడ్పీటిసి సభ్యులు రవీందర్ నాయక్, మాజీ సర్పంచ్‌లు సంగప్ప, పండరి, కురుమ సంఘం తాలుకా ఉపాధ్యక్షులు మల్గొండ, నాయకులు మన్నాన్, అంబాదాస్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి పార్టీ సభ్యత్వానికి అపూర్వ స్పందన



రెడ్డిపల్లిలో బిజెపి సభ్యత్వాన్ని పరిశీలించిన బిజెపి నాయకులు మురళీధర్‌గౌడ్ తదితరులు

**నర్సాపూర్ అక్టోబర్ 24. ప్రభాతవార్త:** నర్సాపూర్ మండలంలోని గ్రామాలలో బిజెపి పార్టీ సభ్యత్వానికి అపూర్వస్పందన లభిస్తుందని బిజెపి నాయకులు మురళీధర్‌గౌడ్ అన్నారు. గురువారం నర్సాపూర్ మండల పరిధిలోని రెడ్డిపల్లి గ్రామంలో బిజెపి నాయకుల అధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమాన్ని బిజెపి నాయకులు మురళీధర్‌గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొని సభ్యత్వ సరళిని పరిశీలించారు. బిజెపి నాయకులు గ్రామాల్లో పర్యటిస్తూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమపథకాలను ప్రజలకు వివరిస్తు సభ్యత్వాన్ని సేకరిస్తున్నారని తెలిపారు.

# కొన్యాల రహదారికి మహర్దశ

## సిఆర్ఆర్‌లో రూ.2.10కోట్లు మంజూరు-రోడ్డు నిర్మాణంతో తీరనున్న ఇక్కట్లు



గుంతల మయంగా మారిన చౌటకూరు-కొన్యాల రోడ్డు దృశ్యం

**చౌటకూరు, అక్టోబరు 24, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన చౌటకూరు నుంచి హత్నూర మండలం కొన్యాల, దౌల్తాబాద్ నర్సాపూర్, ప్రాంతాలకు వెళ్లే రోడ్డు నిర్మాణానికి సిఆర్ఆర్ పథకంలో రూ. 2.10 కోట్ల రూపాయలు మంజూరయ్యాయి. రోడ్డు నిర్మాణ పనులు పూర్తయితే నర్సాపూర్ వెళ్లేందుకు ఏకంగా 20 కిలోమీటర్ల దూరప్రయాణ భారం తగ్గనుంది. అనేక సంవత్సరాలుగా బండ్ల బాటగా పిలిచే ఈ మూడు కిలోమీటర్ల దారిలో గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం ఫార్మేషన్ రోడ్డు వేసి కంకర రోడ్డుగా నిర్మాణం చేశారు. శాసనసభ ఎన్నికల సందర్భంగా చౌటకూరు గ్రామస్థులు రోడ్డును శాశ్వత దహదారిగా ఏర్పాటు చేస్తే కలిగే ప్రయోజనాలపై కాంగ్రెస్ అభ్యర్థి సి.దామోదర్ రాజనర్సింహ దృష్టికి తీసుకుపోగా, శాసనసభ తలుపులు తట్టేలా చేస్తే రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తానని దామోదర్ రాజనర్సింహ ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రమంత్రి బాధ్యతలు నిర్వహిస్తున్న దామోదర్ రాజనర్సింహ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించడంలో సఫలీకృతులయ్యారు.

**తగ్గనున్న 20 కిలోమీటర్ల దూర ప్రయాణం...**

ధన్‌రాస్తా రహదారిగా మారితే చౌటకూరు గ్రామస్థులతో పాటు పుల్కల్ మండలంలోని పలు గ్రామాల ప్రజలకు ఎంతగానే ఉపయోగకరంగా ఉంటుంది. కొన్యాల మీదుగా హత్నూర, దౌల్తాబాద్, నర్సాపూర్ ప్రాంతా లకు వెళ్లేందుకు సంగారెడ్డి, జోగిపేటల మీదుగా ప్రయాణించాల్సి ఉండేది. అందోలు-నర్సాపూర్ శాసనసభ నియోజకవర్గాలకు కనెక్టివిటీ ఉండే విధంగా చౌటకూరు-హత్నూర మండలం కొన్యాల గ్రామశివారులో 10 ఏళ్ల కిందట మంజీర నదిపై వంతెనను నిర్మించారు, అయితే చౌటకూరు గ్రామ శివారు భూములు ఈ ధన్‌రాస్తాకు ఇరువైపులా మంజీర నది వరకు విస్తరించి ఉన్నాయి. వ్యవసాయ పనులకు వెళ్తున్న రైతులు, రైతు కూలీలతో పాటు ఇతర ప్రాంతాల ప్రజలు సైతం అవస్థలు పడుతూ వస్తున్నారు. చౌటకూరు నుంచి నర్సాపూర్ వెళ్లాలంటే సంగారెడ్డి వరకు 20 కిలోమీటర్లు ప్రయాణించి అక్కడి నుంచి మరో 30 కిలోమీటర్లు ప్రయాణించాల్సి ఉంది. 25ఫీట్ల రోడ్డుకు ఇరువైపులా ఆరు ఫీట్ల చొప్పున వెడల్పుచేసి కంకర తొక్కించి డాంబరు రోడ్డుగా మార్చనున్నారు.

**పెరగనున్న భూముల ధరలు...**

ధన్‌రాస్తా రోడ్డు నిర్మాణం పనులు పూర్తయితే చౌటకూరు గ్రామ శివారులోని భూముల ధరలు అమాంతం పెరిగే అవకాశాలు ఉన్నాయి. 161వ జాతీయరహదారికి ఆనుకుని ఉన్న వ్యవసాయ భూముల ధరలు ఇప్పటికే ఆకాశానికి అంటుకుని ఉన్నాయి. పుల్‌కల్ మండలంలోని కోడూరు, గొంగ్లూర్ గ్రామాల రోడ్డుకు నిధులు మంజూరయ్యాయి. కోడూరు నుంచి కోడూరు తండా, బొమ్మారెడ్డిగూడెం, హన్మానాయక్ తండా, లక్ష్మీ సాగర్ గ్రామాల మీదుగా కొండారెడ్డిపల్లి చౌరస్తా వరకు 7 కిలోమీటర్ల రోడ్డు పునరుద్ధరణకు 4.69 కోట్ల రూపాయలు మంజూరయ్యాయి. గొంగ్లూరు గ్రామం నుంచి గిరిజన తండా వరకు 1.4 కిలోమీటర్ల రోడ్డు పునరుద్ధరణకు 98లక్షల రూపాయలు మంజూరయ్యాయి.

**అత్యవసర పనులకు ప్రాధాన్యత...**

ఉమ్మడి పుల్‌కల్ మండలంలోని ఆయా గ్రామాల్లో అత్యవసర పనుల నిర్మాణానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖామంత్రి సి. దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు. గత బిఆర్ఎస్ హయాంలో నియోజకవర్గంలో ఎక్కడా కొత్తరోడ్డు నిర్మాణం చేసిన పాపాన పోలేదన్నారు. రహదారుల పునరుద్ధరణకు నిధులు మంజూరు చేయించామన్నారు. ఎన్నికల సందర్భంగా చేసిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ ముందుకు సాగుతున్నామన్నారు.

**కల నెరవేరింది-చౌటకూరు రైతు...**

ధన్‌రాస్తా పూర్తిగా ధ్వంసం కావడంతో అటుగా వ్యవసాయ పొలాలకు వెళ్లేందుకు పడరాని పాట్లు పడుతూ వస్తున్నామని, రోడ్డు నిర్మాణానికి మంత్రి దామోదర్ రాజనర్సింహ నిధులు మంజూరు చేయించడం ఆనందంగా ఉందని, ఎన్నాళ్లగానో కలలుగన్న నిధుల మంజూరుతో తమ కలలకు సాకారం కల్గిందని ఆనందం వ్యక్తం చేశారు.

**మంత్రి కృషితోనే నిధులు మంజూరు...**

రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖమంత్రి సి.దామోదర్ రాజనర్సింహ కృషి మూలంగానే రహదారి నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని చౌటకూరు గ్రామ కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు వర్కల రమేష్ ఆనందం వ్యక్తంచేశారు. రోడ్డు నిర్మాణం పనులు పూర్తయితే ఈ ప్రాంతంలో మరింత అభివృద్ధి చెందుతుందన్న ఆశాభావం వ్యక్తంచేశారు. రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించిన మంత్రి దామోదర్ రాజనర్సింహాకు, నిధులు మంజూరు చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

## అత్నూర్‌లో దత్తాత్రేయుడికి ప్రాణప్రతిష్ఠ

**న్యాల్‌కల్, అక్టోబరు 24, ప్రభాతవార్త:** మండలంలోని అత్నూర్ గ్రామం ఆధ్యాత్మిక శోభతో విరాజిల్లుతోంది. గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో దత్తాత్రేయస్వామి విగ్రహానికి ప్రాణప్రతిష్ఠ పూజా కార్యక్రమాలు నేత్రపర్వంగా కొనసాగుతున్నాయి. వేద బ్రాహ్మణులు వేదమంత్రాలు వల్లిస్తుండగా పూజా కార్యక్రమాల్లో గ్రామంలోని భక్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొంటున్నారు. గ్రామం దిగంబరా దిగంబరా శ్రీపాద వల్లభ దిగంబరా నామస్మరణతో మారుమ్రోగుతోంది. ఆడపడుచులు తమ పిల్లాపాపలతో గ్రామానికి చేరుకోవడంతో గ్రామం ఆడపడుచులతో సందడిగా మారింది. ఈ నెల 25న గ్రామంలో స్వామివారికి పల్లకిసేవ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

## గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్టు



పోలీసుల అదుపులో గంజాయి తరలిస్తున్న వ్యక్తి

**ఝరాసంగం, అక్టోబరు 24, ప్రభాతవార్త:** ప్రభుత్వం నిషేధించిన గంజాయిని తరలిస్తున్న వ్యక్తిని అరెస్టుచేసి కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించినట్లు సిఐ జక్కుల హనుమంతు, ఎస్ఐ నరేష్‌లు తెలిపారు. గురువారం ఝరాసంగం పోలీసు ఠాణాలో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో హనుమంతు, నరేష్ ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. మండలంలోని బర్దిపూర్ గ్రామంలోని దత్తగిరి ఆశ్రమం సమీపంలో బుధవారం రాత్రికి వాహనాలను తనిఖీ చేస్తున్న తరుణంలో అటుగా మండలంలోని బోపన్‌పల్లి గ్రామానికి చెందిన మ్యాతరి అనిల్ (26) కర్ణాటకలోని బీదర్ పట్టణ శివారు గ్రామమైన షాపూర్ నుంచి ఎండు గంజాయిని (1295 గ్రాములు) తరలిస్తుండగా అనుమానం వచ్చి తనిఖీ చేయగా గంజాయి తరలింపు గుట్టు రట్టయిందన్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించామన్నారు. ఎండుగంజాయినితో పాటు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడు కర్ణాటకలోని షాపూర్ గేటు వద్ద బీదర్‌కు చెందిన పునిత్, జాఫర్ అలీల వద్ద గంజాయి కొనుగోలు చేసినట్లు వివరించారు.

## పిసిసి అధ్యక్షుడికి శుభాకాంక్షలు

**మనూర్, అక్టోబరు 24, ప్రభాతవార్త:** టిపిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్‌ను మెదక్ జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటిసభ్యులు రాజు నాయక్, మాజీ ఎంపిటిసి ఫోరం అధ్యక్షులు రవీందర్ రవినాయక్, యాచారం శ్రీను నాయక్, గంధారిలు గురువారం మర్యాద పూర్వకంగా కలుసుకుని శాలువాతో సత్కరించి పూలబొకేను అందించి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ బలోపేతానికి తమవంతు సహకారం అందిస్తామని మహేశ్వర్‌గౌడ్‌కు హామీ ఇచ్చారు.

## సిఎంఆర్ఎఫ్ చెక్కులు అందచేసిన ఎమ్మెల్యే

**జహీరాబాద్, అక్టోబరు 24, ప్రభాతవార్త:** జహీరాబాద్ పట్టణానికి చెందిన 9 మంది లబ్దిదారులకు 2లక్షల 74వేల రూపాయల సిఎంఆర్ఎఫ్ చెక్కులను గురువారం ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు అందచేశారు. పట్టణంలోని క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో గడివీధికి చెందిన అడివయ్యకు 27వేలు, రామ్‌నగర్ వీధికి చెందిన తుకారాంకు 48వేలు, అల్లీపూర్‌కు చెందిన సాం ప్రజ్వల్‌కు 12వేల 5వందలు, ఫ్రెండ్స్ కాలనీకి చెందిన రజియా బేగంకు 20వేలు, చిన్న హైద్రాబాద్‌కు చెందిన తుక్కమ్మకు 33వేలు, ఆనంద్‌నగర్‌కు చెందిన జమీల్‌కు 13వేల 5వందలు, హమాలి కాలనీకి చెందిన వంశీకృష్ణకు 33వేలు, గాంధీనగర్‌కు చెందిన ఆరిఫాబేగంకు 33వేల రూపాయల చెక్కులను ఎమ్మెల్యే మాణిక్‌రావు అందచేశారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ అధ్యక్షులు బండి మోహన్, మాజీ పట్టణ అధ్యక్షులు యాకూబ్, మహిళా నాయకురాలు పద్మజ సత్యం ముదిరాజ్, ముర్తుజా, రామ్‌నగర్ టేకుమట్ల గణేష్, చంద్రయ్య, లవన్, సందీప్, ఫాహీమ్, పాండు ముదిరాజ్, బిక్కు నాయక్, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రూ.6.70 లక్షలకు కొత్తపల్లి రైసు మిల్లు



కొత్తపల్లి సొసైటీలో రైసు మిల్లు వేలం పాట నిర్వహిస్తున్న దృశ్యం

**పాపన్నపేట, అక్టోబరు 24, ప్రభాతవార్త:** మండల పరిధిలోని కొత్తపల్లి రైతుసేవాసహకార సంఘం ఆధ్వర్యంలోని రైసుమిల్లును గురువారం వేలం (ఏడాది పాటు నడుపుకునేందుకు) వేశారు. వేలంలో పలువురు వ్యాపారులు పాల్గొని వేలంపాటలో పోటీపడ్డారు. చివరగా 6లక్షల 70వేల రూపాయలకు ఏడాదిపాటు నడుపుకునేందుకు రైసుమిల్లును పాండురంగం దక్కించుకున్నారు. వేలంపాటలో 9మంది మిల్లర్లు పోటీపడ్డారు. కార్యక్రమంలో సొసైటి చైర్మన్ ర్యార్ల రమేష్ గుప్తా, సీఈఓ వెంకటేశ్వర్లు, కో-ఆపరేటివ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఫయాజుద్దీన్, డైరెక్టర్లు, సీనియర్ అసిస్టెంట్ రవి, మాజీ జడ్పీటిసి సభ్యులు మల్లప్ప, మిల్లర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఓపెన్ గడువు పొడిగింపు

**పాపన్నపేట, అక్టోబరు 24, ప్రభాతవార్త:** ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షల ఫీజు చెల్లించేందుకు గడువును పొడిగించినట్లు ఓపెన్ స్టడీ సెంటర్ కో-ఆర్డినేటర్ మహేశ్వర్, అసిస్టెంట్ కో-ఆర్డినేటర్ రియాజ్‌లు తెలిపారు. సెప్టెంబరు 20వ తేదీ వరకు ఫీజు చెల్లింపు గడువు ఉండగా, 200 రూపాయల ఫైన్‌తో ఈ నెల 30వ తారీఖువరకు ఫీజు చెల్లించుకునే అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 9912335581కు లేదా పాపన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సంప్రతించాలన్నారు.

# మహిళలు ఆర్థికాభివృద్ధిని సాధించాలి



ఇందిరా మహిళాశక్తి అవగాహన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ తదితరులు

**నర్సాపూర్ అక్టోబరు 24. ప్రభాతవార్త:** ప్రభుత్వం మహిళలకు అందిస్తున్న వివిధ పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధిని సాధించాలని నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ అన్నారు. గురువారం నర్సాపూర్‌లోని మున్సిపల్ కార్యాలయంలో మెప్మా ఆధ్వర్యంలో ఇందిరా మహిళాశక్తిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ పాల్గొనగా, మెప్మా పిడి ఇందిరా, నర్సాపూర్ మెప్మా అధికారి దేవపాల, మున్సిపల్ కమీషనర్ రామకృష్ణారావు, మెప్మా రిసోర్స్ పర్సన్ రాజీవ, మేనేజర్ మధుసూదన్ తదితదరులుపాల్గొన్నారు. ఈ సందర్భంగా మెప్మా ఆర్‌సిలకు అవగాహన కల్పించడం జరిగింది, ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వం మహిళాశక్తి ద్వారా పలు యూనిట్లను అందజేస్తుందన్నారు. ఈ యూనిట్లను ప్రతి ఒక్క మహిళ సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలన్నారు. అనంతరం మెప్మా పిడి ఇందిర మాట్లాడుతూ కోటి మహిళలను కోటీశ్వరులుగా చేయడమే ప్రభుత్వలక్ష్యమన్నారు. ఈ మేరకు మహిళాశక్తి కింద ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్లను మంజూరు చేసిందన్నారు. ఈ సందర్భంగా నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలో 16 యూనిట్లు మంజూరు కాగా, 10 యూనిట్లు ప్రారంభమయినట్లు తెలిపారు. కాగా ప్రభుత్వం మొత్తం జిల్లాకు 68 సంఘాలకు సుమారు రూ.8కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. ఈ మేరకు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ధాన్యం, కూరగాయలు, మొక్కజొన్నలు వంటి ఆహారపదార్థాలు మాత్రమే ఈ యూనిట్లలో ఉండాలన్నారు. ఇందులో ఒక్కో యూనిట్‌కు సుమారు రూ.3లక్షల 50వేల రుణం లభిస్తుందని తెలిపారు. ఈ రుణాల్లో 35 శాతం ప్రభుత్వం సబ్సీడీ ఇస్తుండగా 15 శాతం లబ్దిదారుడు భరించాలని, మిగతా 50 శాతం బ్యాంక్ ద్వారా రుణం ఇవ్వడం జరుగుతుందన్నారు. అనంతరం మున్సిపల్ కమీషనర్ రామకృష్ణారావు మాట్లాడుతూ, ఇందిరాశక్తి పథకం ద్వారా యూనిట్లను మహిళలందరు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఈ మేరకు యూనిట్లను ఎంచుకొని మంచిగా నడిపించి, అభివృద్ధి చెందాలన్నారు. రుణాల రికవరీ క్రమం తప్పకుండా చేయాలని తెలిపారు. తర్వాత రిసోర్స్ పర్సన్ రాజీవ మాట్లాడుతూ మహిళాశక్తి పథకంలో మహిళలు ఏ విధంగా యూనిట్లను ఎంచుకోవాలో, ఎటువంటి యూనిట్లను పెట్టుకోవాలో తెలియజేశారు. ఈ మేరకు పథకం వివరాలను విధివిధానాలను క్లుప్తంగా వివరించారు. ఈ కార్యక్రమంలో మెప్మా అధికారులు, ఆర్‌సిలు తదితరులు పాల్గొన్నారు.

## రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



తుర్కపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

**నారాయణఖేడ్ టౌన్, అక్టోబరు 24, ప్రభాతవార్త:** మండల పరిధిలోని తుర్కపల్లిలో ఇందిరా క్రాంతిపథకం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ, రైతుల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పాలన సాగిస్తోందన్నారు. రైతులు సాగుచేసిన ప్రతి గింజను గిట్టుబాటు ధరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్, ఐకెపి అధికారులు, నాయకులు అశోక్‌రెడ్డి, రమేష్ చౌహాన్, పండరిరెడ్డి, ఈశ్వరప్ప, శంకర్ ముదిరాజ్, దత్తుగౌడ్, నరసింహారెడ్డి, నెహ్రూ నాయక్, జ్ఞానేశ్వర్‌రెడ్డి, రాజు నాయక్, శివకుమార్, వెంకన్న సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## తొగుట పీఠాధిపతిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే



తొగుట పీఠాధిపతిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

**నారాయణఖేడ్ టౌన్, అక్టోబరు 24, ప్రభాతవార్త:** పట్టణంలోని శ్రీరమా సహిత సత్యనారాయణస్వామివారి ఆలయాన్ని గురువారం తొగుట పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ మాధవానందస్వామి దర్శించుకున్నారు. ఆలయానికి మాధవానంద సరస్వతి స్వామివారు వచ్చినట్లు తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు అందుకున్నారు. కార్య క్రమంలో మాజీ జడ్పీటిసి సభ్యులు రవీందర్ నాయక్, పట్టణ బిఆర్ఎస్ అధ్యక్షులు నగేష్ సేట్, టిఆర్ఎస్వీ నియోజకవర్గ అధ్యక్షులు అంజాగౌడ్, మాజీ సర్పంచ్ సంగప్ప, శ్రీనివాస్, నాయకులు, ఆలయ కమిటి బాధ్యులు ఉన్నారు.

## ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలి



ఎంఈఓ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ తారాసింగ్

**నర్సాపూర్ అక్టోబర్ 24. ప్రభాతవార్త:** ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలని ఈ మేరకు సమయ పాలన పాటించకపోతే చర్యలు తప్పవని మండల విద్యాధికారి తారాసింగ్ అన్నారు. గురువారం నర్సాపూర్ పట్టణంలోని ఎంఈఓ కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలన్నారు. నర్సాపూర్ మండలవ్యాప్తంగా కొత్తగా 7 మంది ఉపాధ్యాయులు రాగా మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ సీట్లు భర్తీ అయినట్లు తెలిపారు. ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలల్లో ఏవైనా సమస్యలు తమదృష్టికి తెస్తే, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. అలాగే ప్రతి పాఠశాలను నిరంతరం సందర్శిస్తామని అన్నారు. ఈమేరకు రాబోయే పదవ తరగతి పరీక్షల్లో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. అలాగే విద్యార్థులు క్రమశిక్షణతో మంచిగా విద్యను అభ్యసించాలని ఎంఈఓ తారాసింగ్ సూచించారు. ఈ కార్యక్రమంలో సిఆర్‌పి భైరవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మెదక్‌కు మెడికల్ కళాశాల మంజూరు



విలేకరులతో మాట్లాడుతున్న మున్సిపల్ మాజీ చైర్మన్ ఆరెళ్ల మల్లికార్జున్ గౌడ్

కళాశాల మంజూరు కావటానికి తప్పకుండా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పట్టుదల, ప్రత్యేక చొరవ అని చెప్పకతప్పదని మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ ఆరెళ్ల మల్లికార్జున్ గౌడ్ తెలిపారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ మెదక్ పట్టణంలోని పిల్లికొట్యాల్‌లో మెడికల్ కళాశాల ప్రారంభోత్సవ కార్యక్రమం శుభసూచకం, చరిత్రాత్మకమని అన్నారు. గతమా కెసిఆర్ ప్రభుత్వం ఇచ్చిన జీవో ప్రకారం, 18ఎకరాల స్థలాన్ని పిల్లికొట్యాల్ మాతాశిశు సంరక్షణకేంద్రం వెనకాల కేటాయించి అప్పటి ఆరోగ్య శాఖామంత్రి తన్నీరు హరీష్‌రావు చేతులమీదుగా భూమిపూజ జరిగిందన్నారు. అలాగే వందసీట్లతో 2023-24 విద్యాసంవత్సరం ప్రారంభించాలని ఏర్పాటుచేశారు. నేడు ప్రారంభించిన మెడికల్ కళాశాల 50 సీట్ల నుండి 100కు పెంచాలని, దీనితోపాటు నర్సింగ్ కళాశాల, పారా మెడికల్‌ను అనుసంధానంగా ఏర్పాటుచేయవలసిందిగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ మెడికల్ కళాశాల కోసం మాజీ మంత్రులు తన్నీరు హరీష్‌రావు, మాజీ శాసనసభ్యులు పద్మాదేవేందర్‌రెడ్డి ఎనలేని కృషిచేసి మెదక్ ప్రజల చిరకాల కోరికను నేడు సాకారం చేశారని, కేసీఆర్ మదిలో నుంచి పుట్టిన సంకల్పం రాష్ట్రంలో, జిల్లాల్లో మెడికల్ కళాశాల ఏర్పాటు కేవలం కేసీఆర్ ముందుచూపు ఫలితం అనే చెప్పుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకిరెడ్డి కృష్ణారెడ్డి, పట్టణ కౌన్సిల్ సభ్యులు భీమరి కిషోర్, ఆర్‌కె. శ్రీనివాస్, సులోచన ప్రభురెడ్డి, వంజరి జయరాజు, యువ నాయకులు శ్రీను నాయక్, రంజిత్ నాయక్, లడ్డు, భువనచంద్ర, దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

## పాత్రికేయులకు వర్క్‌షాప్

**రామాయంపేట, అక్టోబర్ 24, ప్రభాతవార్త:** మెదక్ పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో శుక్రవారం జర్నలిస్టులకు వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు ప్రెస్ ఇన్ఫర్మేషన్ డిప్యూటీ డైరెక్టర్ మానస్‌కృష్ణకాంత్ తెలిపారు. మెదక్ జిల్లా పాత్రికేయులకు ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ఆహ్వానం పలుకుతుందన్నారు. మెదక్ పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో ఈనెల 25వ తేదీ శుక్రవారం ఉదయం 10.15 గంటలకు హైదరాబాద్ ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో జర్నలిస్టుల కోసం మీడియా వర్క్‌షాప్ నిర్వహిస్తోందని తెలిపారు. ముఖ్య అతిథులుగా మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్‌రావు, జిల్లాకలెక్టర్ రాహుల్‌రాజ్‌లు హాజరు అవుతున్నారని, జిల్లాలోని ప్రింట్, ఎలక్ట్రానిక్‌మీడియా హాజరు కావాలన్నారు.